

# మ్యూజికల్ మ్యూజింగ్స్



## – కస్తూరి మురళీకృష్ణ

కహీన్, దూర్, జబ్ దిన్ ఢల్ జాయే
సాంఝ్ కి దుళన్ బదన్ చురాయే,
చుప్ కే సె ఆయే,
మెరే ఖయాలోం కే అంగన్‌మే
కోయి సప్నోంకా దీప్ జలాయే.

'ఆనంద్' సినిమాలో ముకేష్ అత్యంత భావయుక్తంగా పాడిన ఈ యోగేష్ పాట ఎంత విషాదాన్ని చిలికిస్తుందో, అంతగా ఆనందింపచేస్తుంది. నిజానికి ఈ పాటను సంపూర్ణంగా విషాదగీతం అని కూడా అనలేము. నాయకుడు తన ఫలించని ప్రేమను తలచుకుంటూ పాడేపాట ఇది. కానీ పాటలోని పదాలలో విషాదం లేదు. విఫలమైన ప్రేమను తలచుకుని విలపిస్తూనే, ఆ విలాపంలోనే అంతర్లీనంగా అంతర్వాహినిగా ప్రవహించే మధురమైన బాధ, ఆ బాధను అనుభవించటంలోని మాధుర్యం స్పష్టంగా తెలుస్తూంటుంది. శ్రోత సైతం ప్రేమ వైఫల్యాన్ని అనుభవించకున్నా, నిజ జీవితంలో ప్రేమ భావనను స్పర్శించకున్నా, పాటలోని మధురమైన వేదనకు స్పందిస్తాడు. ఓ వైపు బరువైన బాధను అనుభవిస్తూనే ఆనందిస్తాడు. సుఖాన్ని అనుభవిస్తాడు. 'మరుపురాని బాధ కన్నా మధురమే లేదోయ్' అన్న సత్యాన్ని అర్థం చేసుకుంటాడు.

సినిమాలో నాయకుడి విఫల ప్రేమ గురించి ఎక్కడా స్పష్టంగా ఉండదు. కేవలం ఓ కవిత పుస్తకం, ఆ పుస్తకంలో ఓ పేజీలో ఎండిన పువ్వు, నాయకుడు సాయం సంధ్యను చూస్తూ మరపురాని బాధను తలచుకుంటూ మధురమైన గేయాన్ని పాడటం మాత్రం ప్రేక్షకులకు తెలుస్తుంది. అస్పష్టమైన విఫలప్రేమ స్వరూపం అస్పష్టంగానే ఉన్నా, పాటలోని స్పష్టమైన ఆనందపు వేదన శ్రోతను మురిపించి, ఆనంద పరవశుడిని చేసి, విషాదంలో ఒదిగిన మహానందపు మహా సముద్రపు అలల తాకిడికి ఉక్కిరి బిక్కిరి చేస్తుంది.

ఎక్కడో దిగంతంలో దూరంగా రోజు పూర్తయి, సాయంత్రం అవుతున్న వేళ సాయం సంధ్య పెళ్లికూతురి అలంకరణతో రూపాన్ని ధరిస్తున్నప్పుడు, అతి నిశ్శబ్దంగా వచ్చి ఆలోచనల ప్రాంగణంలో స్వప్నాల దీపాన్ని వెలిగిస్తోందట. అత్యద్భుతమైన కవితాత్మకమైన ఊహ ఇది. 'సాంజ్ కి దుల్‌హన్ బదన్ చురాయే' అన్నది అత్యంత సృజనాత్మకమైన ఊహ.

అందరికీ తెలుసు, సూర్యోదయ, సూర్యాస్తమయాలు అత్యంత సుందరమైనవని. ఏరోజుకి ఆ రోజు ఆకాశ వేదికపై ప్రత్యేకంగా జరిగే కళాప్రదర్శనకు నిలయాలు అని తెలుసు. వేద ఋషులు సూర్యోదయం సమయాన్ని 'ఉష' అనే అందాల బాలగా ఊహించారు. ప్రపంచానికి వెలుగు నిస్తుంది. జీవుల ప్రాణాలను కిరణాల గుప్పెట్లో ధరించి వస్తుంది. చీకటిని, చెడును, దయ్యాలు, భూతాలను, రాక్షసులను తరిమివేస్తుంది. ప్రపంచానికి చైతన్యాన్నిస్తుంది. అదే సాయంత్రం అయ్యేసరికి జగతి పనులు ముగిస్తుంది. ప్రజలు అలసి సొలసి ఇళ్లకు చేరతారు. పక్షులు కిలకిలరావాలతో గూళ్లకి చేరుకుంటుంటాయి. ఆకాశం సూర్యాస్తమయ కిరణాలతో పలు విభిన్నమైన రంగుల విన్యాసంతో ప్రియుడితో పొందుకై అలంకరించుకుంటున్న నవ వధువులా ఉంటుంది. పగలంతా పలు పనుల్లో సకలం మరచిన మానవుడు రాత్రి, వేళ

విశ్రాంతి తీసుకుంటూ ఆలోచిస్తాడు. గడచిన రోజుల గురించి ఆలోచిస్తాడు. గతాన్ని తలచుకుని సంతోషించటమో, విచారించటమో చేస్తాడు. ఇక్కడ కవి ముందు పాదంలో దూరంగా రోజు పూర్తవుతున్న సమయం ('దిన్‌ఢల్‌నా') అన్నాడు. మనకు సూర్యాస్తమయంతో రోజు పూర్తవుతుంది. అంటే, సూర్యుడు దిగంతంలోకి జారుకున్నాడు. సాధారణంగా సూర్యుడు దిగంతాలలోకి జారిన తరువాత కూడా సూర్య కిరణాల వెలుతురు ఉంటుంది. ఈ వెలుగు నెమ్మదిగా రాత్రిలోకి మారుతుంది. ఈ సమయాన్ని వర్ణిస్తున్నాడు కవి. అలా సూర్యాస్తమయం అయిన తరువాత, సంధ్య నెమ్మదిగా వస్తోంది. ఇక్కడ 'బదన్ చురానా' అన్న idiom వాడాడు కవి. 'ఆంఖే చురానా' అంటే కళ్లు తిప్పుకోవటం. 'బదన్ చురానా' అంటే శరీరాన్ని ధరించటం లేక దాచటం అన్న విభిన్నమైన అర్థాలు వస్తాయి. సాయం సంధ్య శరీరం ధరించింది, లేక శరీరాన్ని దాస్తూ, నిశ్శబ్దంగా వచ్చింది. అతడి ఆలోచనల ప్రాంగణంలో దీపం వెలిగించింది. అంటే, అతడి ఆలోచనలకు నాందీ ప్రస్తావన చేసింది. అతడి ఆలోచనల ప్రాంగణాన్ని ప్రకాశవంతం చేసింది. విషాదంలో ఉన్న వారికి ఒంటరితనం జ్ఞాపకాలను పునశ్చరణ చేసుకునే సమయం. ముఖ్యంగా ఒంటరి రాత్రిళ్లు అత్యంత బాధాకరం. కవి, అక్షరాలతో ఆ బాధామయమైన చిత్రాన్ని అత్యంత సుందరంగా గీస్తున్నాడు.

ఇక్కడే సందర్భ పరిధిలో ఒదిగి 'సినీ పాటను' విశ్లేషించి అర్థం చేసుకోవాల్సిన అవసరం స్పష్టమవుతుంది. 'ఆనంద్' సినిమాలో నాయకుడు అల్పాయుష్కుడు. కేన్సర్ వ్యాధి ఉంటుంది. దాంతో అతని జీవితకాలం పరిమితం అనీ, ఎక్కువ కాలం బ్రతకడనీ తెలుస్తుంది అందరికీ. ఆనంద్‌కి కూడా ఆ విషయం తెలుసు. కానీ చావంటే లెక్కలేనట్టు అందరినీ నవ్విస్తూ, నవ్వుతూ, తుళ్లుతూ ఉంటాడు. అలాంటి ఆనంద్ ఆలోచిస్తూ, విషాదంగా కనిపించే ఏకైక సన్నివేశం ఇది. అతడికి ఏదో విఫల ప్రేమగాధ ఉందన్న భావనను కలిగిస్తాడు దర్శకుడు. కానీ అదేమిటో స్పష్టంగా చెప్పడు. దాంతో ఈ సన్నివేశంలో నాయకుడి వేదన పరిధి కేవలం విఫల ప్రేమకు పరిమితం కాక విస్తృతమవుతుంది.

నాయకుడికి తన జీవితకాలం పరిమితం అని తెలుసు. సాధారణంగా సాయంత్రాన్ని జీవితకాలంలో అంత్యదశకు ప్రతీకగా వాడతారు. 'దిన్‌ఢల్‌జానా'అర్థం మారి పోతుంది. అతడి జీవితం చరమాంకంలో ఉందన్న ఆలోచన కలుగుతుంది. దాంతో 'సంధ్యాదేవి' మృత్యువు అవుతుంది. మృత్యువు ఎప్పుడు, ఎలా వస్తుందో తెలియదు కానీ శబ్దం లేకుండా, వస్తుంది వస్తున్నట్టు తెలియకుండా వస్తుంది. దాంతో 'బదన్ చురాయ్' అర్థం కూడా మారుతుంది. మృత్యువు పెళ్లికూతురిలా నెమ్మదిగా వస్తోందన్నమాట. 'మృత్యువు శరీరం ధరించినా, శరీరం కనబడదు'. కాబట్టి శరీరం ధరించటం, శరీరాన్ని అదృశ్యం చేయటం అన్న రెండు విభిన్నమైన అర్థాలు ఒదిగిపోతాయి. దాంతో 'ఆలోచనల ప్రాంగణంలో దీపం వెలిగించటం' అన్న భావం కూడా నూతన అర్థాన్ని సృతరించుకుంటుంది. దినం సాయంత్రంగా ఆపై రాత్రిగా ఎంత స్వాభావికంగా రూపాంతరం చెందుతాయో, మనిషి జననం, జీవితం, మరణం కూడా అంత స్వాభావికంగా రూపాంతరం చెందుతాయి. ఇక్కడ ఆనంద్ మరణానికి చేరువలో ఉన్నాడు. సాయం సంధ్యలో నిలబడి చీకటిలోకి తొంగిచూస్తున్నాడు. ఆ సమయంలో అతని మనస్సులో కలుగుతున్న భావ సంచలనాలను పాట ప్రతిబింబిస్తుంది. ఇప్పుడు అతని పాటలోని విషాదం కేవలం విఫల ప్రేమ గురించి మాత్రమే కాదు, అది అతను జీవించకపోవటం వల్ల కోల్పోయే అనుభవాలు, కలవలేని మనుషులు, అనుభవించలేని ఆత్మీయతలు. ఇలా ఒక జీవితకాలంలోని అనుభవాలకు, అనుభూతులకు అతడు దూరమరబోతున్నాడు. missing possibilitiesకు సంబంధించిన వేదనకూడా అతని పాట ప్రతిఫలిస్తుంది.

ఈ సందర్భంలో తాత్విక విషాద గీతం రాయవచ్చు. ఇలాంటి సందర్భంలో 'సఫర్' సినిమాలో 'జిందగీ కా సఫర్, హై యె కైసా సఫర్, కోయ్ సంజా నహీ, కోయి జానా నహి' అన్న అద్భుతమైన తాత్వికత ఉట్టిపడే ప్రశ్నలు కూడుకున్న గీతాన్ని 'ఇందీవర్' సృజించాడు.

ఇలాంటి సందర్భంలో వేటూరి, గీతాంజలి సినిమాలో

**ఆమనీ, పాడవే హాయిగా**

**మూగవై పోకు ఈ వేళా**

రాలేటి పూలా రాగాలతో

పూచేటి పూలా గంధాలతో

మచుతాకి కోయిలా, మౌనమైన వేళలా..

అన్న పరమాద్భుతమయిన భావగీతాన్ని సృజించాడు.

ఆనంద్ సినిమాలో యోగేష్ మృత్యువు ప్రసక్తి ప్రత్యక్ష్యంగా లేకుండా ఎంతో మార్మికంగా, సూచ్యప్రాయంగా మృత్యువు భావనను గీతంలో పొందు పరచాడు. అంతగా ఆలోచించలేని వారికి అతడు సాయంపూట, ఒంటరిగా, గతాన్ని తలచుకుని విషాదంతో ఆలోచనలు చేస్తున్నాడన్నట్టు అర్ధమవుతుంది. పదాలు పైపైన ప్రదర్శించే అర్థాల పొరలను చీల్చుకుని కాస్త లోతుకు వెళ్తే, నెమ్మదిగా వచ్చే మ్రుత్యువును తలచుకుంటూ గతాన్ని, కోల్పోతున్న భవిష్యత్తును తలచుకుంటూ ఆలోచనతో విలపిస్తూ ఆలపిస్తున్న వేదనాత్మక గీతం అని అర్ధమవుతుంది.

సినిమా పాటలు అని తేలికగా కొట్టేసేవారు ఒక్క నిముషం నిలిచి ఆలోచించాల్సి వస్తుంది. ఇది కవిత. అత్యద్భుతమైన కవితాత్మికమయిన గేయం. సినిమా ఫాట అన్న భావన వదిలేస్తే మాములుగా రాస్తున్న కవితలలో లేని సాంద్రత, భావ గాంభీర్యం, ప్రతీకలు ఈ గేయంలో ఉన్నాయి. ఇక్కడ మరో ఆలోచన వస్తుంది. నిజానికి సినిమాల్లో ఎన్నో హిట్ పాటలుంటాయి. ఉర్రూతలూగిస్తాయి. మనసును మురిపిస్తాయి. శరీరాన్ని ఊపేస్తాయి. వెర్రెక్కించేస్తాయి. కానీ కొంతకాలానికి ఇలా వెర్రెక్కించిన పాటలన్నీ మరుగున పడతాయి. జ్ఞాపకం వచ్చినప్పుడు సంతోషింపచేస్తాయి. కానీ అధికశాతం విస్మ్రుతిలో పడతాయి. ఒకోసారి 'ఈ పాటను ఇంతగా ఎలా మెచ్చుకున్నామో' అనీ అనుకుంటాం. కానీ ఎల్లప్పటికీ గుర్తుండి, వెంటాడి మరీ, మరీ మరీ వినేట్టు చేసేవి. వింటున్న కొద్దీ మరింతగా ఆనందాన్ని, స్వాంతననూ ఇచ్చేవి విషాద గీతాలే!

'హై సబ్ సె మధుర్ వో గీత్ జిణే

హం దర్ద్ కె సుర్ మే గాతే హై

జబ్ హద్ సె గుజర్తేహై ఖుషీ

ఆసూ భి ఛలక్ తే ఆత్ హై

అన్నిటి కన్నా మధురమైన గీతాన్ని వేదన భరితమైన రాగంలో పాడతాడట. ఎందుకంటే సంతోషం ఒక హద్దు దాటితే కన్నీళ్లే, దొర్లుతాయి కాబట్టి. 'పతిత' సినిమాలో శైలేంద్ర రాసిన గీతం ఎంత మృదు మధురమైనదో అంతే మృదువుగా గానం చేస్తాడు తలత్ మహమూద్.

‘ All the sweet songs that we admire are tragic’ –P.B Shelly అన్న మాటలను గుర్తుకు తెస్తుందీ పాట. అంటే, మనకు ఎన్నో రకాల పాటలు ఎంతయినా నచ్చనీ. చివరికి అన్నిటికన్నా ఎక్కువగా నచ్చేది విషాదగీతాలేనన్నమాట. అందుకే గాయనీ గాయకులెవరయినా ఈనాటికీ ప్రజల మనస్సులలో నిలిచి ఉన్నవి విషాదగీతాలే. సైగల్ అనగనే 'జబ్ దిల్ హీ టూట్ గయా' గుర్తుకు వస్తుంది. లతా, రఫీ, కిషోర్ కుమార్ వంటి గాయకులు ఎన్నో అద్భుతమైన గీతాలు పాడారు. కానీ అధికంగా వినబడే వీళ్ల పాటలన్నీ విషాదగీతలే. ముఖేష్ విషాద గీతాలకు పెట్టింది పేరు. సినిమాలు కూడా సుఖాంతాలకన్నా విషాదాంతలే మనకు బాగా గుర్తుంటాయి

'దేవదాసు', 'మరోచరిత్ర' 'శంకరాభరణం', 'సాగర సంగమం' ఇలా తరచి చూస్తే ప్రేక్షకులు సినిమాలకు వచ్చేది వినోదం కోసమే అని ఎంతమంది నొక్కి వక్కాణించినా కడివెడు కన్నీళ్లు, బిందెడు సానుభూతి, కురిపించి గుండెడు విషాదం మూట కట్టుకోవటంలో ప్రేక్షకులు ఎంతో ఆనందాన్ని పొందుతున్నారనిపిస్తుంది.

**ఘర్‌సే చలేతే హం తొ ఖుషీకే తలాష్ మే,**

**గం రాహమే పడే హై వహీ సాథ్ హోలియే**

'అదాలత్' సినిమాలో రాజేంద్ర కిషన్ రాసిన అత్యద్భుతమైన గజల్‌లోని పంక్తులివి. లతా మంగేష్కర్ అత్యద్భుతంగా భావాన్ని అనుభవిస్తూ పాడిన పాట ఇది. గుండెలు పిండేసే విషాదం. ఆమె సంతోషాన్ని వెతుకుతూ ఇల్లు వదిలిందట. దారిలో విషాదం వెంట పడింది. అదె వెంట వచ్చింది. పరమాద్భుతమైన భావం.

**సుఖ్ హోయా దుఖ్, జబ్ సదా సంగ్ రహెనా కోయీ**

**ఫిర్ దుఖ్ కో అప్నాయిఏ, కె జాయెతో దుఖ్ న హోయ్.**

'దోస్తీ ' సినిమాలో 'మజ్రూహ్ ' రాసిన పాట ఇది. సుఖమో, దుఃఖమో రెంటిలో ఏదో ఒకటి వెంట ఉండటం తప్పనప్పుడు, దుఃఖాన్నే స్వీకరించటం మంచిది. అది వదిలి వెళ్లేటప్పుడు బాధ కలగదు అంటాడు కవి.

మనిషి సుఖాన్ని ఎంతగా వాంఛించినా దుఃఖాన్ని స్వీకరించటం అలవాటు చేసుకోక తప్పదు.

**సంఝౌతా గమోంసె కర్‌లో**

**జిందగీ మే గం భీ మిల్తే హై**

బాధలతో రాజీపడమంటున్నాడు ఇందీవర్ 'సంఝౌతా' సినిమాలో. ఎందుకంటే జీవితంలో బాధలూ లభిస్తాయి కాబట్టి.

**ఇస్ కాహి జీనా కెహేతేహై తో యూహీ జీ లేంగే**

**ఉఫ్ నకరేంగే, లబ్ సీలేంగే, ఆసూ పీలేంగే**

**గం సే అబ్ ఘబ్ రానా కైసా గం సౌబార్ మిలా..**

జీవితం ఇంతే అంటే, ఎలాంటి విసుగు, బాధ చిరాకులు కనబరచకుండా ఇలాగే జీవిస్తాను. పెదిమలు కుట్టుకుంటాను. కన్నీళ్లు తాగుతాను. బాధకు భయపడటం ఎందుకు? అది బోలెడన్ని సార్లు అనుభవించాను అంటున్నాడు హృదయాన్ని ద్రవింపచేసే 'ప్యాసా' గీతం 'జానెవొకైసె 'లో 'సాహిర్' .

ఇలా తరచి చూస్తే అనేక విషాదగీతాలు పొంగిపొర్లే కన్నీళ్లలా ముత్యాలై, రత్నాలై కొండపైనుంచి దూకే జలపాత ధారలై విషాదగీతాలు పరుగు పరుగున గుర్తుకు వస్తాయి. ఎదలో తీయని బాధను కలిగిస్తాయి.

ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. బాధలో ఉన్న వాడికి సంతోషకరమైన పాటలు వినిపించాలంటారు. కానీ ఆ బాధను మరింత ఎక్కువ చేసే పాటలు వింటూంటే బాధ శిఖర స్థాయికి చేరుకుని నెమ్మదిగా ఉపశమిస్తుంది. బాధలో లేని వాడికి కూడా బాధను అనుభవానికి తెచ్చి తీయని వేదనను కలిగిస్తాయి పాటలు. ఆ తీయని వేదనలోనే తెలియని ఆనందాన్ని కలిగిస్తాయి. మనిషి విషాదంలో ఆనందాన్ని పొందటం సామాన్యులకే కాదు శాస్త్రవేత్తలనూ ఆశ్చర్యపరిచింది. మానసిక శాస్త్రవేత్తలు, న్యూరాలజిస్టులు, మెదడు పనితీరు పరిశోధకులు విషాద గీతాలు కలిగించే ఉపశమనం, ఆనందాల గురించి పలురకాల పరిశోధనలు చేశారు.

ఇంగ్లండ్ కు చెందిన Durham University, ఫిన్ల్యాండ్‌కు చైందిన Jyvasyla university లలో 2436 మందిపై ప్రయోగాలు, పరిశోధనలు జరిగాయి. విషాద గీతాలు వినిపించి వారిలో కలిగిన భావనలు విశ్లేషించారు. విషాదగీతాల వల్ల వ్యక్తులలో సుఖం, ఆనందం, తీయని బాధల భావనలు కలిగాయని కనుగొన్నారు.

ఆస్ట్రేలియాకు చెందిన యూనివర్సిటీ మానసిక శాస్త్రవేత్త అడ్రియాన్ నార్త్ విషాద గీతాలు ఆనంద భావనను కలిగించటానికి రెండు రకాల కారణాలను సూచించాడు. Downward social comparision అంటే తనకన్నా అధికమైన బాధలో ఉన్న వాడిని చూసి, వాడికన్నా మెరుగైన స్థితిలో తానున్నానన్న ఒకరకమైన సంతృప్తి.

**దునియా మే కిత్నా గం హై, మేరా గం కిత్ నా కం హై**

**లోగోంకా గం దేఖాతో, మై అప్నా గం భూల్ గయా**

'అమృత్' సినిమాలో ఆనంద్ బక్షీ పాట ఇదే చెప్తోంది. ప్రపంచంలో ఎన్నెన్నో బాధలు ఉన్నాయి. వాటితో పోలిస్తే నా బాధ ఎంతో చిన్నది. ఇతరుల బాధలు చూస్తూ, నేను నా బాధను మరచిపోయాను అంటున్నాడు కవి.

ప్రేమలో వైఫల్యం చెందిన వాడు ప్రేమలో విలపిస్తూ పాడే హీరో విషాద గీతం వింటూ దానితో స్పందిస్తాడు. హీరో బాధను అనుభవిస్తాడు. తద్వారా తన బాధను ప్రక్షాళన చేసుకుంటాడు. దీన్ని 'empathetic concern' అంటారు అంటే ఇతరుల బాధతో సహ అనుభూతి చెందుతూ లేక బాధను మరిచిపోవటం అన్నమాట. దీన్లోనే మరోరకం నిజంగా బాధలు ఏమీ లేకున్నా, పాటలోని బాధతో సహానుభూతి చెందటం ద్వారా పొందలేని అనుభూతిని అనుభవిస్తూ ఒకరకమైన సంతృప్తినీ, ఆనందాన్నీ అనుభవిస్తాడు వ్యక్తి. ఇందుకు కారణం 'న్యూరో సైన్స్' వివరిస్తుంది. విషాద గీతాలు వ్యక్తులలో ప్రోలాక్టిక్ హార్మోన్ ఉత్పత్తికి దారి తీస్తుంది. ఈ ప్రోలాక్టిక్ హార్మోన్ విషాదం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. శరీరాన్ని బాధను అనుభవించేందుకు సిద్ధం చేస్తుంది. ఎప్పుడయితే ఆ ఊహించిన విషాదకరమయిన సంఘటన అనుభవానికిరాదో, అప్పుడు శరీరంలో ఆనందాన్ని కలిగించే రసాయనాలు మిగిలిపోతాయి. వాటివల్ల ఆనందం కలుగుతుంది. అందుకే 'హృదయం పగలని'వాడు కూడా 'ఎక్ దిల్ కే టుక్డే హజార్ హువే' అని రఫీ పాడగానే తన హృదయం వెయ్యి వక్కలయిన బాధను అనుభవించి సంతోషిస్తాడు. ఒంటరితనం అంటే భయపడేవాడు కూడా ' ముఝ్ కొ ఇస్ రాత్ కి తన్హాయి మే అవాజ్ నకో ' అనే ముకేష్ విషాద గీతాన్ని విని ముడుచుకుపోతాడు. ఆనందిస్తాడు.

ఈ విషయంపై జరిగిన పరిశోధనల ఫలితాలను 'సైకాలజీ టుడే' అన్న పత్రికలో శాస్త్రవేత్తలు 2015లో ప్రచురించారు. విషాద సంగీతానికి మనుషుల స్పందించటానికి మొత్తం ఆరు కారణాలను వారు సూచించారు.

గతం జ్ఞాపకాలు: ప్రతివ్యక్తీ ఏదో ఓ సమయంలో ఆకర్షితుడవుతాడు. స్త్రీ అయితే పురుషుడి వైపు, పురుషుడు అయితే స్త్రీ వైపు. కానీ ఈ ఆకర్షణ అంతకుమించి ఎదగదు. మనుషులు ఎదుగుతారు. కానీ ఆ ఆకర్షణ కలిగించిన స్పందనలు మాత్రం మెదడు పొరల్లో భద్రంగా ఉంటాయి. ఆ జ్ఞాపకాలను జాగృతం చేసే సంగీతం వినిపించినప్పుడు జాగృతమయిన తీపి జ్ఞాపకాలు తీయని బాధను కలిగిస్తాయి. వాటిని గుర్తు చేసుకోవటమే ఒక అందమైన అనుభవం.

ప్రక్షాళన: సంగీతం వల్ల కలిగిన స్పందనలు, అనుభవానికి రాని విషాదాన్ని అనుభవానికి తేవటం వల్ల వ్యక్తిలో ఉత్తేజాన్ని కలిగిస్తాయి. దాంతో అతడిలోని నిరాశలు, నిస్పృహలు అన్నీ ఈ ఉత్తేజంలో కొట్టుకుపోతాయి. సంగీతం మాధుర్యానికి కంటనీరు పొంగుతుంది. ఆ ప్రవహించే నీటిలో లేని బాధలు కొట్టుకుపోతాయి.

ప్రొలాక్టిన్, సహానుభూతి వంటి వాటి గురించి ముందే చర్చించాం.

సంగీతం వల్ల మెదడులోని అన్ని భాగాలు స్పందిస్తాయి. సాహిత్యం సృజించిన దృశ్యాలు ఆ స్పందనకొక రూపం కల్పిస్తాయి. ఇది వ్యక్తి 'మూడ్'ను స్థిరపరుస్తుంది.

సంగీతం ఒక స్నేహితుడిలాంటిది. ముఖ్యంగా, పాటలలోని భావాలు ఒక స్నేహితుడు తన వేదనను వినిపిస్తున్నట్టుంటాయి. కొన్ని భావాలు మన మనస్సుల్లోని భావాలను ప్రతిబింబిస్తాయి. ఇంకొన్ని పాటలు మనల్ని మరో లోకానికి తీసుకు వెళ్లిలేని అనుభూతులను

కలిగిస్తాయి. నిద్రాణమై ఉన్న నిరాశను, ఆశలను తట్టిలేపుతాయి. అంటే ఒక మాయస్నేహితుడిలాగా Virtual friendలాగా ప్రవర్తిస్తుందన్నమాట సంగీతం.

ఇటీవలి కాలంలో ఒంటరితనం, నిరాశ నిస్పృహలు అధికమై వ్యక్తులు 'ఆత్మహత్య'లకు పాల్పడుతున్నారు. వారికి తెలియనిదేమిటంటే, వారి బాధలను మరపించి, కన్నీరు తుడిచి, ఆత్మస్థైర్యాన్నిచ్చి జీవిత కాంక్షను రగిలించే సంగీతం దగ్గరలోనే ఉందన్న విషయం మరచిపోతారు. నిజానికి ఏ వ్యక్తీ మరో వ్యక్తికి సంపూర్ణమైన స్నేహాన్ని ఇవ్వలేడంటారు. మనిషికి అసలైన స్నేహితులు, పుస్తకాలు, సంగీతం మాత్రమే. అదీ విషాద సంగీతం ఇంకా ఎక్కువ. అందుకే music therapy ఒక శాస్త్రంలా ఎదుగుతోంది. సాహిత్యం, సంగీతం వెంట ఉంటే ప్రపంచం అదృశ్యమయినా వ్యక్తి ఒంటరివాడు కాడు అంటారు. సాహిత్యం, సంగీతం కలగలసిన పాటలు అందుకే ఎంత విషాదవంతమయితే అంత ఆనందాన్నీ, సంతోషాన్నీ కలిగిస్తాయి. ఇందుకు చక్కని ఉదాహరణ 'కహీ దూర్ జబ్ దిన్ ఢల్ జాయే.'

పాట పల్లవి ఇన్ని ఆలోచనలు కలిగిస్తే, చరణాలు ఇంకెన్ని ఆలోచనల సముద్రాలను కలిగిస్తాయో? ఎందుకంటే, ఇంతవరకూ మనం పాటలోని సాహిత్యాన్ని ప్రస్తావించుకున్నాం. ఇక సంగీతం గురించి చర్చిస్తే ఎన్నెన్ని అనంత సముద్రాలు పెల్లుబుకుతాయో!

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments